కొమురవెల్లిలో కష్టాల కోలాటం!

చేర్యాల, ఫిబ్రవరి 4 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల 3వ ఆదివారం సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. 50వేల మందిగాపైగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, సనత్‌నగర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు కుటుంబ సమేతంగా మల్లన్నను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

'మల్లన్న' భక్తులకు ఇక్కట్లు

ఆలయవర్గాలు, పోలీసుల ఆంక్షల కారణంగా భక్తులు ఈసారి చాలా ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల నుంచి కొమురవెల్లికి ప్రైవేటు వాహనాల్లో రాగా, వాహనాలను క్షేత్రానికి చాలాదూరంలోనే పోలీసులు నిలిపివేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ సామగ్రి నెత్తిన పెట్టుకుని ఇబ్బందులు పడుతూ ఆలయానికి చేరుకున్నారు. గదులు దొరకకపోవడంతో పరిసరాల్లో గుడారాలు వేసుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువజామునే ఆలయ క్యూలైన్లకు వచ్చిన భక్తులకు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. స్వామి వారి క్షేత్రంలోని ఆలయానికి అనుకుని ఉండే వీఐపీ గెస్ట్‌హౌస్ నంబర్‌వన్ నుంచి చాలామంది పైరవీలతో ప్రవేశించడంతో సామాన్య భక్తులు మల్లన్న దర్శనం కోసం గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. క్షేత్రంలో దాతలు నిర్మించిన గదులు నిండిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రైవేటులో రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించి జేబులు ఖాళీ చేసుకోవాల్సి వచ్చింది. అయినా చాలామందికి రూమ్‌లు దొరక్క పోవడంతో డబ్బులు చెల్లించి టెంట్లు వేసుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద డబ్బులు చెల్లించి స్నానాలు చేశారు. కల్యాణ కట్ట వద్ద క్షురకులు రూ.50 నుంచి రూ.100 చెల్లిస్తేనే తలనీలాలు తీశారు. కాంగ్రెస్ సర్కారులో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సౌకర్యాలు లేక తప్పని ఇక్కట్లు

పొలాల వద్ద డబ్బులు ఇచ్చి స్నానాలు చేస్తున్న భక్తులు

ఇబ్బందిపడ్డ అన్నదాత

బ్రహ్మోత్సవాల సమయంలో 7 ఆదివారాలపాటు ఏటా 4 వేల మందికి అన్నదానం చేస్తున్న మల్లన్న భక్తుడు శంకర్‌యాదవ్ ఆలయవర్గాలు, పోలీసుల చర్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈసారి ఆలయవర్గాలు, పోలీసుల ఆంక్షల కారణంగా స్వామి వారి క్షేత్రానికి దూరంగా వాహనాలు నిలిపివేయడంతో అక్కడి నుంచి వంట సామగ్రి, పనులు చేసే కార్మికులు వాటిని నెత్తిన పెట్టుకొని రాలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో దాత శంకర్‌యాదవ్ తమ వాహనాలకు అనుమతి ఇవ్వాలని పోలీసులు, ఆలయవర్గాల దృష్టికి తీసుకుపోయిన వారు పట్టించుకోలేదు.

భువనగిరి ఏరియా దవాఖాన వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థినుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

పోలీసులు కొట్టారని గాయాలను చూపిస్తున్న విద్యార్థిని కుటుంబ సభ్యురాలు

మా బిడ్డలది హత్యే

ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు

- మా పిల్లలు పిరికోళ్లు కాదు
- వార్డెన్, వాచ్‌మెన్, ఆటోడ్రైవర్‌పైనే మాకు అనుమానం
- ఎస్సీ హాస్టల్, ఏరియా దవాఖాన ఎదుట పేరెంట్స్ బైఠాయింపు
- ఆందోళనకు బీఆర్ఎస్, ప్రజాసంఘాల మద్దతు
- పోలీసులతో వాగ్వాదం.. ఉద్రిక్తం
- మిన్నంటిన రోదనలు.. ఆర్తనాదాలు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : 'మా బిడ్డలు ఆత్మహత్య చేసుకోలేదు. సూసైడ్ చేసుకునేంత పిరికివాళ్లు కాదు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయాలి' అని డిమాండ్ చేస్తూ భువనగిరిలోని ఓ హాస్టల్‌లో చనిపోయిన పదోతరగతి విద్యార్థినులు భవ్య, వైష్ణవి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఎదుట, ఆ తర్వాత ఏరియా దవాఖాన ఎదుట మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. ఉదయం నుంచే ఎస్సీ హాస్టల్‌కు వచ్చిన కుటుంబ సభ్యులు అక్కడే ధర్నాకు దిగారు. స్థానికులు, ప్రజా సంఘాల వారు వారికి మద్దతుగా నిలిచారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో అక్కడి నుంచి స్థానిక ఏరియా దవాఖాన ముందు మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. వీరికి బీఆర్ఎస్‌తోపాటు విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. రోడ్డుపైనే ఆందోళనకు దిగి పెద్ద ఎత్తున ప్రభుత్వానికి నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డెన్, వాచ్‌మెన్, ఆటోడ్రైవర్‌పై తమకు అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. సూసైడ్ లెటర్‌లో హ్యాండ్ రైటింగ్ తమ పిల్లలది కాదని స్పష్టం చేశారు. ఇటీవల ఆటో డ్రైవర్ విషయంలో చిన్న ఘటన జరగ్గా తమ దృష్టికి వచ్చిందని, ఇది పక్కా హత్యేనని వారు మండిపడ్డారు. సుమారు 45 నిమిషాలపాటు రోడ్డుపైనే భీష్మించి కూర్చున్నారు. దీంతో రోడ్డుకు రెండు వైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. పోలీసులు చేసేదేం లేక వాహనాల రాకపోకలను మళ్లించారు.

మిన్నంటిన రోదనలు

ఇద్దరు విద్యార్థినుల విషాద ఘటనతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చేతికొచ్చిన పిల్లలు చనిపోయారనే వార్తను జీర్ణించుకోలేకపోయారు. అక్కడే కింద పడి గుండెలవిసేలా రోధించారు. గుండెలు బాదుకుంటూ తమ పిల్లలను పదేపదే తలచుకుంటూ బోరుమన్నారు. ఈ ఘటన అక్కడున్న వారిని కలచివేసింది. స్థానికులు సైతం కంటతడిపెట్టారు. విద్యార్థినుల శ్రద్ధాంజలి ఫ్లెక్సీని చూసి భవ్య తల్లి ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది. మరోవైపు వైష్ణవికి తల్లి లేదు. చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి దివ్యాంగుడు. తన తమ్ముడు సైతం ఆరేండ్ల క్రితమే చనిపోయాడు. ఒక్కగానొక్క కూతురు కూడా చనిపోవడంతో ఆ తండ్రికి కండ్లలో ఏడ్వడానికి నీళ్లు కూడా రావడంలేదు.

కొనసాగుతున్న దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతికి కేసు నమోదు చేశారు. పట్టణంలోని సాయికృప డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం ఉదయం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థినులు కుటుంబ సభ్యులతోపాటు ప్రజాసంఘాల వారితో కలిసి హాస్టల్‌లో విచారణ చేపట్టారు. పోలీసుల సహకారంతో క్లూస్ టీం వివరాలను సేకరించింది. కాగా వార్డెన్, వాచ్‌మెన్, ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నారు. ఏరియా దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. నివేదిక వస్తేనే విషయం తెలిసే అవకాశం ఉన్నది.

తోపులాటలో మహిళలకు గాయాలు

పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తుండటంతో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టేందుకు కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల వారు బయలుదేరాయి. ఈ క్రమంలో పోలీసులు, మహిళల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మహిళలకు గాయాలయ్యాయి. ప్రశాంత వాతావరణంలో ఆందోళన చేస్తున్న తమను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి రక్తమొచ్చేలా కొట్టారని మహిళలు ఆరోపించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఏరియా దవాఖాన వద్దకు వచ్చి విద్యార్థినుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నిజాం షుగర్స్‌పై నివేదిక ఇవ్వండి

- క్యాబినెట్ సబ్‌కమిటీకి సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు వీలైనంత త్వరగా సమగ్ర నివేదికను సమర్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు. బోధన్, ముత్యంపేటలో మూతపడ్డ నిజాం షుగర్ ఫ్యాక్టరీలకు సంబంధించిన పాత బకాయిలు, ఆర్థిక ఇబ్బందులపై ఆదివారం సచివాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో చర్చించారు. ఆయా ప్రాంతాల్లోని చెరుకు రైతుల అవసరాలు, ఇప్పుడున్న సాధక బాధకాల గురించి సమగ్రంగా చర్చించారు. నిర్ణీత గడువు పెట్టుకొని నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఏ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులతో కిటకిటలాడిన గద్దెలు

మేడారం బంగారానికి ఆంక్షలు

- కొనుగోళ్లకు ఆధార్‌కార్డు తప్పనిసరి చేసిన అధికారులు
- భక్తులు, వ్యాపారులకు ఇక్కట్లు

మహబూబాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): మేడారం భక్తులపై అధికారులు ఆంక్షలు విధించారు. బంగారం (బెల్లం) కొనుగోళ్లకు ఆధార్ కార్డు తప్పనిసరి చేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. జాతరలో భక్తులు పెద్ద ఎత్తున బంగారాన్ని అమ్మవార్లు సమ్మక్క, సారలమ్మకు సమర్పిస్తారు. గతంలో ఈ బెల్లాన్ని అక్రమార్కులు కొనుగోలు చేసి గుడుంబా తయారీకి వినియోగించేవారని, అధికారులు అమ్మకాలపై నిఘా పెట్టేవారు. ఈ ఏడాది ఏకంగా బెల్లం కొనుగోళ్లకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆంక్షలు విధించారు. బంగారం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఫోన్ నంబర్ సేకరించి తమకు అందజేయాలని వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిబంధనలపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనను సడలించాలని వ్యాపారులు, భక్తులు కోరుతున్నారు.

పీఆర్సీ కసరత్తు ప్రారంభం

- ఆయా శాఖలు, విభాగాలతో సంప్రదింపులు
- నేడు, రేపు హోంశాఖ అధికారులతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతన సవరణకు ఏర్పాటుచేసిన నూతన వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) కసరత్తును ప్రారంభించింది. ఫిట్‌మెంట్‌పై సోమవారం నుంచి శాఖల వారీగా సమావేశాలు నిర్వహించనున్నది. ఈ మేరకు 5, 6 తేదీల్లో హోంశాఖకు సంబంధించిన అధికారులతో సమావేశం కానుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయా విభాగాల అధికారులకు పీఆర్సీ కమిటీ సమాచారాన్నిచ్చింది. బీఆర్కే భవన్‌లోని ఏడో అంతస్థులో కాన్ఫరెన్స్ హాల్లో హెచ్‌వోడీలతో పీఆర్సీ కమిటీ సంప్రదింపులు జరపనుంది. ఉద్యోగుల వేతన సవరణకు వీలుగా కేసీఆర్ ప్రభుత్వం నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయగా, ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా పీఆర్సీ తన పనిని ప్రారంభించింది.

- జూన్ 4 నుంచి గ్లోబల్ రైస్ సమ్మిట్

జూన్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్‌లో గ్లోబల్ రైస్ సమ్మిట్ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమ్మిట్ బ్రోచర్‌ను ఆదివారం ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఐసీఐ సలహాదారు అల్దాస్ జానయ్యతో కలిసి మంత్రి ఆవిష్కరించారు.

50 కోట్లు ఇస్తే ఆది శ్రీనివాస్ మంత్రయితడు!

- తీన్మార్ మల్లన్న ఆసక్తికర వ్యాఖ్యలు

వేములవాడ, ఫిబ్రవరి 4: మున్నూరు కాపు సమాజం మొత్తం కలిసి రూ.50 కోట్లు ఇప్పుడున్న ప్రభుత్వ ఖజానాకు అందజేస్తే ఆది శ్రీనివాస్ మంత్రి అవుతాడని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం 11వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం మున్నూరు కాపు కార్పొరేషన్ త్వరలోనే ఏర్పాటు కాబోతుందని చెప్పారు. దీనిని ఉద్దేశిస్తూ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో పెద్దగా ఒరిగేదేమీ ఉండదని అన్నారు. రూ.100 కోట్లు కేటాయిస్తే అది ఏ మూలకు సరిపోదని తెలిపారు. ఇంతటితో ఆగకుండా రాష్ట్రంలోని కాపులందరూ తలా వంద రూపాయలు వేసి రూ.50 కోట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేయూతగా అందిస్తే ఆది శ్రీనివాస్ మంత్రి అవుతాడని చెప్పుకొచ్చారు. మాజీ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలోకి రావాలనుకుంటున్నానని, ఖమ్మం లేదా సికింద్రాబాద్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు.

ఫ్రీ బస్సు పెట్టి.. ఆపుతలేరు!

- మహిళలను ఆర్టీసీ సిబ్బంది చులకనగా చూస్తున్నరు
- మాకు ఫ్రీ బస్సు లేకున్నా సరే.. ఏందీ ఇబ్బంది?
- బస్టాండ్‌లో బస్సు డ్రైవర్‌పై ఓ మహిళ ఆగ్రహం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)/ధర్మారం: 'నేను పొద్దుగాల నుంచి బస్ స్టేజీ దగ్గర నిలబడి ఉన్న.. బస్సులు పోతున్నయ్.. చెయ్యి అడ్డంపెట్టినా ఆపడం లేదు.. ఇదేం పద్ధతి.. ఉచిత ప్రయాణమని బస్సు ఆపకుండా మహిళలను అవమానిస్తే ఎట్లా..? అవసరమైతే టికెట్ కొట్టండి' అంటూ ఓ మహిళ ఆర్టీసీ సిబ్బంది తీరుపై మండిపడ్డది. కంట్రోలర్ ఆఫీసుకు చేరుకొని ఆర్టీసీ అధికారుల తీరుపై విరుచుకుపడ్డది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లికి చెందిన రజిత మందమర్రికి వెళ్లడానికి ఉదయం 7 గంటలకు గ్రామంలోని స్టేజీ వద్దకు వచ్చి నిలబడింది. బస్సు రావడంతో చెయ్యి అడ్డంపెట్టి ఆపమన్నది. కానీ, డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. వేరే బస్సు వచ్చే వరకు ఎదురుచూసి.. అది పట్టుకుని ధర్మారం చేరుకొని.. అధికారులకు కంప్లైంట్ చేసేందుకు వచ్చింది. అక్కడ అధికారి లేకపోవటంతో నిరసన తెలిపింది. 'నేను మంచిర్యాలలోని మందమర్రికి పోవాలె. ఉదయం 7 గంటలకే మా ఊరి స్టేజీకి వచ్చి నిలబడి ఆపిన. కానీ, డ్రైవర్ ఆపకుండా దంచుకుని ధర్మారం వచ్చిండు. నేను పైసల్ లేక రాలేదు. ఇగో నా చేతిలో రూ.500 నోటు ఉన్నది. అవసరం అనుకుంటే టికెట్ తీసుకోండి. నా ఆధార్ కార్డుతో ఏమి పని? ఉచితమని చెప్పి మహిళనని చూసి బస్సు ఎందుకు ఆపరు? ఆపతికి పోతుంటే ఇట్ల చేస్తే ఎట్లా. ఫ్రీ బస్సు పథకం అని పెట్టి.. ఎందుకు ఇంత మోసం చేస్తున్నరు? అంటూ నిలదీసింది. రజిత నిరసనకు బస్టాండ్‌లో ఉన్న మరికొందరు మహిళలు కూడా ఆమెతో గొంతు కలిపారు. 'అందరు డ్రైవర్లు అలాగే చేస్తున్నారు. ఆడవాళ్లు కనిపిస్తే చాలు బస్సు ఆపకుండా పోతున్నారు' అంటూ ఓ మహిళ చెప్పుకొచ్చింది. 'ఈ రోజు ఎగ్జామ్ ఉంది. ఒక్క బస్సు కూడా ఆపలేదు. టైం అయిపోతుందని బండి పట్టుకుని వచ్చాను' అంటూ మరో మహిళ తన కష్టాన్ని వివరించింది. ఈ మహిళల గోడును వీడియో తీసిన ఓ యువకుడు.. దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయగా, వైరల్‌గా మారింది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళ

కండక్టర్లను తిట్టిన నిందితురాలి అరెస్టు

- 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- పోలీసులకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కృతజ్ఞతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని హయత్‌నగర్ డిపో–1కు చెందిన ఇద్దరు కండక్టర్లను ఇటీవల దారుణంగా తిట్టి, దాడికి పాల్పడిన ఘటనలో నిందితురాలైన అంబర్‌పేటకు చెందిన సయ్యద్ సమీనాను ఎల్బీనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సమీనాను రంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసు విచారణను త్వరగా చేపట్టి నిందితురాలిని అరెస్టుచేసిన పోలీసులకు టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినా, దాడులకు పాల్పడినా యాజమాన్యం ఏ మాత్రం సహించబోదని సజ్జనార్ హెచ్చరించారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలుంటాయని చెప్పారు.

టీఎస్ కాదు; టీజీ!

మొదటిపేజీ తరువాయి...

శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఒక వ్యక్తిని గుర్తుకు తెచ్చేలా ఉన్నదని, రాష్ట్ర అధికారిక చిహ్నంలో రాచరిక పోకడలు ఉన్నాయని అందుకే వాటిని మార్చాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు చెప్పారు. కవులు, కళాకారులు, మేధావుల అభిప్రాయాలను తీసుకొని తుది రూపు ఇస్తామని చెప్పారు. తెలంగాణ కోసం పోరాడిన వారు, అనేకసార్లు జైలుకు వెళ్లిన వారికి తెలంగాణ చిహ్నంలో స్థానం కల్పిస్తామని తెలిపారు. ఆర్టీసీలో ఇప్పటివరకు 14.25 కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారని వెల్లడించారు. త్వరలో తాము అమలుచేయబోమే మరో రెండు గ్యారెంటీలపై ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేస్తారని చెప్పారు.

గ్రూప్స్ ఉద్యోగాల భర్తీకి కసరత్తు

ఉద్యోగ నియమాకాలకు సంబంధించి వ్యవసాయ శాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకున్నామని మంత్రులు చెప్పారు. గ్రూప్ 1, 2, 4 ఉద్యోగాలకు సంబంధించి పూర్తి స్థాయి కసరత్తు చేసిన తర్వాత నిర్ణయిస్తామని చెప్పారు. మెగా డీఎస్సీకి సంబంధించి ఎన్ని ఖాళీలు ఉన్నాయో గుర్తించాలని, పాత డీఎస్సీ కేసులకు సంబంధించిన వివరాలు సేకరించాలని సీఎం ఆదేశించినట్టు తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏఈవోల ఖాళీల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం తమ హయాంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రక్రియ మొదలైందని అన్నారు. ఇక ఉద్యోగుల ప్రమోషన్ల విషయంలో కసరత్తు జరుగుతుందని తెలిపారు. హైకోర్టుకు కేటాయించిన 100 ఎకరాల భూమిపై విద్యార్థులు, మేధావులు చేస్తున్న అభ్యంతరాలు తమ దృష్టికి వచ్చాయని త్వరలో పరిష్కారం చూపుతామని అన్నారు.

రేపు రాంచీకి సీఎం, డిప్యూటీ సీఎం

రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయయాత్రలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం జార్ఖండ్ రాజధాని రాంచీకి వెళ్తున్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో వెళ్లి, సాయంత్రం తిరిగి రానున్నారు.

క్యాబినెట్ నిర్ణయాలు..

- 8 నుంచిఅసెంబ్లీ సమావేశాలు ప్రారంభం.
- మరో రెండు గ్యారెంటీల అమలుకు ఆమోదం. అసెంబ్లీలో ప్రకటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి.
- వాహనాల రిజిస్ట్రేషన్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్పు, త్వరలో చట్టం.
- రాష్ట్ర గీతంగా అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'
- కుల గణనకు ఆమోదం.
- తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖల మార్పు.
- తెలంగాణ అధికార చిహ్నం మార్పు.
- కొడంగల్‌కు ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు.
- రాష్ట్రంలోని 65 ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా మార్పు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కోర్సులు.
- హైకోర్టుకు వంద ఎకరాల భూమి మంజూరు చేస్తూ ఆమోదం.
- ఖైదీలకు క్షమాభిక్షపై న్యాయపరమైన చర్యలు తీసుకునేలా నిర్ణయం.

ఇసుక ధర డబుల్

మొదటిపేజీ తరువాయి...

అవ్వడం లేదని పేర్కొంటున్నారు. రోజంతా కూర్చున్నప్పటికీ ఇసుక దొరకటం లేదని, తప్పని పరిస్థితుల్లో అడ్డాల మీదకు వెళ్లి లారీల్లోని ఇసుకను కొనుగోలు చేయాల్సి వస్తున్నదని, లారీల యజమానులు చెప్పిందే ధర అవుతున్నదని వాపోతున్నారు. గతంలో ఎన్నూడూలేనంతగా ఇప్పుడు ఇసుక కొరత ఏర్పడింది. నగరంతోపాటు రాష్ట్రంలోని అన్ని నగరాల్లో ఇసుక ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక్కసారిగా ధరలు పెరగటంతో సామాన్యులు నివ్వెరపోతున్నారు. ఇంటి నిర్మాణం మొదలుపెట్టుకున్నవాళ్లు ఇసుక ధర అమాంతం పెరగటంతో అంచనాలన్నీ తలకిందులయ్యాయని బాధపడుతున్నారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేయటం ఎలా అన్నదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. వాస్తవానికి ఇది ఇండ్ల నిర్మాణానికి అనుకూలమైన సమయం. ఇప్పుడు స్లాబ్‌లు, గోడలు వంటివాటిని పెట్టుకునేవారు ఇప్పుడే వేగం పెంచుతారు. వేసవి వచ్చేనాటికి ఒక రూపానికి వచ్చి, వర్షాకాలం నాటికి పనులన్నీ పూర్తవుతాయని భావిస్తుంటారు. కానీ పరిస్థితులు తలకిందులు అవటం సామాన్యులవంతు అవుతున్నది.

రాష్ట్రంలోని క్వారీల మూత!

రాష్ట్రంలో సుమారు 40 పెద్ద క్వారీలున్నాయి. వీటి ద్వారా ప్రతిరోజు సుమారు 60 వేల నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను వెలికి తీస్తుంటారు. మంచి డిమాండ్ ఉన్నప్పుడు కూడా ఏనాడూ హైదరాబాద్ మార్కెట్‌లోటన్ను ఇసుకకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 మించలేదు. ఇసుక కావాల్సినంత అందుబాటులో ఉండేది. కానీ, ఇప్పుడు ప్రతిరోజు రాష్ట్రంలోని క్వారీల నుంచి 20 వేల క్యూబిక్ మీటర్లకు మించి రావటం లేదు. దీంతో లారీల యజమానులు ధరలను పెంచుతున్నారు. ఒక వైపు ఇసుక లభ్యత తగ్గడం, మరోవైపు ఇండ్ల నిర్మాణం జరుగుతుండటం, డిమాండ్ పెరగటంతో ధరలు ఆకాశాన్ని అంటాయి. తెలంగాణలో ఉన్న క్వారీలను ఉద్దేశపూర్వకంగానే మూయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యమైన క్వారీలున్నచోట స్థానిక ఎమ్మెల్యేలు, అక్కడి అధికారులతో ఒత్తిడి చేయించి తాత్కాలికంగా మూయిస్తున్నారు. క్వారీల నిర్వాహకులు తమను వచ్చి కలవాలని హుకుం జారీ చేస్తున్నట్టు తెలిసింది. అంతే కాదు.. క్వారీల వద్ద తమవారిని పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. వీటన్నింటిని హైదరాబాద్‌లోని ఒకరిద్దరు మానిటర్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. వారు చెప్పినట్టే ఇప్పుడు క్వారీలు మూయించేశారు.

ఆంధ్ర ఇసుకకు గేట్లు తెరిచారు!

తెలంగాణలో క్వారీలు మూయించి ఏపీ నుంచి వచ్చే ఇసుకకు మాత్రం గేట్లు ఓపెన్ చేశారు. వాస్తవానికి ఇతర రాష్ట్రాల నుంచి ఇసుకను తీసుకురావడాన్ని ప్రభుత్వం నిషేధించింది. కానీ, ఇప్పుడు మన రాష్ట్రంలో ఇసుక ధరలను అదుపు చేసేందుకు అనిచెప్పి బయటి రాష్ట్రాల ఇసుకను ప్రోత్సహిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక యంత్రాంగమే పనిచేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడాన్ని నిషేధించింది. ఈ మేరకు ఆ రాష్ట్రం జీవో నంబర్ 71 జారీచేసింది. జీవోలోని రూల్ నంబర్ 15లో ఇదే విషయం స్పష్టంగా ఉన్నది. దీని ప్రకారం ఇతర రాష్ట్రాలు, సరిహద్దులకు అవతల ఉన్న ప్రాంతాలకు ఇసుక అమ్మడం నేరం. ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డి సర్కారు ఈ నెల 3న ఒక మెమోను జారీచేసింది (మెమో నంబర్ 87/p(sand)/2014). ఈ మెమోను గనులశాఖ డైరెక్టర్ బీఆర్‌వీ సుశీల్ కుమార్ జారీ చేశారు. దీనిలో ఏం పేర్కొన్నారంటే.. 'మన రాష్ట్రంలో ఇసుక కొరత ఉన్నది. దీన్ని అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఇసుకపై రూ.200 రెగ్యులేటింగ్ చార్జీల కింద వసూలు చేసి ఇసుకను అనుమతించాలి' అని పేర్కొన్నారు. దీనికి సంబంధించి